భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0

వైసీపీ హయాంలో నిలిచిన నిర్మాణాలకు మోక్షం
5

బాబు మార్క్ మంత్రులెవరో ?

• నేడే విడుదల

సామాజిక వర్గాల వారీగా ప్రాధాన్యత

- కొత్త ముఖాలకు ఛాన్స్ ఇవ్వబోతున్నారా ?
- ఈసారి ఇద్దరితో సరిపెట్టడానికే సిద్ధమా ?
- హ్యాట్రిక్ వీరుడు నిమ్మలకే ఛాన్స్

కూటమి ప్రభుత్వంలో అమాత్యులెవరో ? కొత్త ముఖాలకు అవకాశం ఇస్తారా ? లేక సీనియర్లకే పట్టం కడతారా ? హ్యాట్రిక్ సాధించిన వారికి తొలి ప్రయారిటీ ఇస్తారా ? తొలిసారి ఎన్నికై భారీ మెజార్టీ సాధించిన వారిని అందలం ఎక్కిస్తారా ? ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రుల ఎంపిక ఎలా ఉండబోతోంది ? అనే ప్రశ్నలకు కొన్ని గంటల్లో స్పష్టత రానుంది. బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో మంత్రుల ఎంపికపైనే ఇప్పుడు చర్చ నడుస్తోంది

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

గత చంద్రబాబు మంత్రి వర్గాల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఎస్సీ, బీసీ, క్షత్రియులకు ఎక్కువసార్లు అవకాశం దక్కింది. 2014 ఎన్నికల్లో ఎస్సీ సామాజిక వర్గం నుంచి అటు పీతల సుజాత, ఇటు జవహర్, మరోవైపు పితాని సత్యనారాయణలకు మంత్రి వర్గాల్లో చోటు దక్కింది. కాపు సామాజిక వర్గానికి ఇవ్వాలని భావించినా పొరుగునవున్న తూర్పు నుంచి అవకాశం ఇస్తున్నాం కాబట్టి ఇక్కడ ఆయా సామాజికవర్గాలు కాకుండా భిన్న సామాజిక వర్గాలకు చోటు ఇచ్చారు. ఈసారి చంద్రబాబు వినూత్న పాలన సాగించనున్నందున దానికి తగ్గట్టు మంత్రుల ఎంపిక ఉండబోతుంది. గతంలో మాదిరి కాకుండా సత్తా ఉన్న వారినే మంత్రులుగా తీసుకోవాలని, ఆ దిశగానే తుది కసరత్తుకు దిగారు. ఉమ్మడి పశ్చిమలో కూటమికి తిరుగులేని ఆధిక్యతతో గెలవడం ఈసారి అత్యంత విశేషం. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లావారీగా అన్ని కోణాల్లోనూ పరిశీలించి ఎంపిక చేయబోతున్నారు. వివిధ సామాజిక వర్గాల సిఫార్సులను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదన్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈసారి మంత్రివర్గంలో బీసీ వర్గాల తరపున పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణకు, కాపు సామాజిక వర్గం నుంచి



ఆకివీడు దత్తక్షేత్రంలో దత్తాత్రేయుడిని దర్శించి, పూజలు, హోమాలు, పూర్ణాహుతి చేసిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు -6లో

నిమ్మల రామానాయుడికి, క్షత్రియ సామాజికవర్గం నుంచి రఘురామకృష్ణరాజుకు చోటు కల్పించబోతున్నారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. గతంలో కాసంత తక్కువ మెజార్టీతో గెలవడం, తక్కువ సీట్లలోనే మంత్రులను ఎంపిక చేయాల్సి రావడం, పెద్ద కష్టమయ్యే విషయంగా ఉండేది కాదు. ఈ సారి ఏకపక్షంగా ఓటర్లు తీర్పును ఇవ్వడం, కొత్త ప్రభుత్వంపై ఎక్కువ ఆశలు పెంచుకోవడం తగ్గట్టుగానే మంత్రుల ఎంపిక దగ్గర నుంచి, సాధారణ పాలన వరకు అన్నింటిని బేరీజు వేసుకున్న తర్వాతే ముందడుగు వేసే దిశగా చంద్రబాబు అతిపెద్ద కసరత్తు చేసినట్టు చెబుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గాల నుంచి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేరు వినిపిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఎస్సీ సామాజిక



సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న చంద్రబాబును ఆయన నివాసంలో కలిసి అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, అంతకు ముందు లోకేశ్‌ను కలిసి అభినందించారు.

వర్గాలకు ఇదే జిల్లా నుంచి మంత్రులుగా ఎంపిక చేస్తూ వచ్చారు. ఈసారి కూడా అదే ఆనవాయితీని కొనసాగిస్తారా? లేదా? అనేది మంగళవారం తేలిపోనుంది. ఇంకోవైపు కేంద్ర మంత్రి వర్గంలో నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు అవకాశం దక్కింది. ఈ నేపథ్యంలో ఇదే జిల్లాలో ఆయన సామాజిక వర్గానికి చెందిన వారికి రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కల్పిస్తారా ? లేదా ? అన్నది కొందరు వాదిస్తున్నారు. రాజకీయ అంచనాలకు లోబడే చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకుంటారని, కేంద్ర మంత్రులతో రాష్ట్ర మంత్రి వర్గంతో ఏ మాత్రం ముడిపెట్టడం తగదన్నది ఇంకొందరి వాదన. రకరకాల రాజకీయ పరిణామాల క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి కేవలం ఇద్దరికి మాత్రమే అవకాశం దక్కడం ఖాయమనే వాదనా వుంది.

మంత్రి రేసులో పత్సమట్ల



• నిడమర్రు జూన్ 10 : రాష్ట్ర మంత్రి వర్గ జాబితాలో స్థానం సంపాదించేందుకు ఉంగుటూరు జనసేన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జనసేన తరపున ఆరుగురికి మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తే ఒక ఎస్సీ, రెండు బీసీ, మూడు ఓసీ ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు దక్కవచ్చు. మూడు ఓసీ మంత్రి వర్గ స్థానాలలో రెండు కాపు సామాజిక వర్గానికి, ఒకటి క్షత్రియ సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం ఉంది. మంత్రివర్గ విస్తరణకు ముందు పార్టీ ఎమ్మెల్యేలతో మంగళవారం జనసేనాని పవన్ కల్యాణ్ ప్రత్యేక భేటీ నిర్వహిస్తున్నారు. తమ పార్టీ తరపున ఎంత మందికి మంత్రి వర్గంలో చోటు కల్పించే అవకాశం వుందో స్పష్టత రానుంది.

లోకేశ్, పవన్ కంటే నిమ్మలకే ఆధిక్యత



జిల్లా నుంచి మూడోసారి వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడి పేరు మంత్రుల జాబితాలో తొలివరుసలో ఉండబోతున్నట్టు ప్రచారం ఊపందుకుంది. గడిచిన రెండు విడతల్లోనూ నిమ్మల తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సాధించడంతోపాటు పార్టీ ఆశించినట్లు ఓ సామాన్య కార్యకర్తగా జనాల్లో ఎదగడం, పార్టీ లక్ష్యాలను పక్కన పెట్టకుండా కష్టపడడం ఆయన విజయానికి దారితీసిన అంశాల్లో ప్రధానమైనవి. ఉమ్మడి జిల్లాలో జనం మధ్యే ఉన్న ఏకైక ఎమ్మెల్యే నిమ్మల మాత్రమే. ఆయనకు పాలకొల్లులో 70 శాతానికిపైగా ఓట్లు దక్కాయి. టీడీపీ మొత్తం మీద ఈస్థాయిలో మరెవరూ లేరు. నెల్లూరు సిటీ నుంచి ఎన్నికైన మాజీ మంత్రి నారాయణకు 68.68 శాతం, మూడోస్థానంలో రాజమండ్రి సిటీ నుంచి ఆదిరెడ్డి వాసుకు 67.68, నాలుగో స్థానంలో గాజువాక నుంచి శ్రీనివాసరావుకు 67.28, ఐదో స్థానంలో తణుకు నుంచి ఆరిమిల్లి రాధాకృష్ణకు 66.51, ఆ తర్వాత వరుసగా మంగళగిరిలో నారా లోకేశ్‌కు 66.07, కాకినాడ రూరల్‌లో పంతం నానాజీకి 65.11 శాతం, పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌కు 65 శాతం దక్కింది. ఆఖరికి జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు 64.87 శాతం, విజయవాడ నుంచి బొండా ఉమకు 63.59 శాతం, భీమిలి నుంచి ఘంటా శ్రీనివాస్‌కు 63.33 శాతం లభించాయి. ఈ లెక్కల పరంపరను ఆయన అభిమానులంతా ప్రచారం చేశారు. నిమ్మలకున్న ముక్కుసూటి వ్యవహారం, జనం మధ్య గడపడమే కారణంగా 70 శాతం ఓట్లు ఆయన దక్కించుకున్నారు. వీటిని తెలుగుదేశం అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంది. లోకేశ్, పవన్‌కంటే మించిన ఓట్ల శాతాన్ని కైవశం చేసుకున్న రామానాయుడు అన్ని విధాలా మంత్రిగా అర్హుడని తేల్చి ఆ దిశగానే నిర్ణయాలకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. ప్రత్యేకించి కాపు సామాజిక వర్గానికి చెందిన కోటాలోనే కాకుండా పార్టీ పరంగా ఆయన అటు ప్రజల్లోనూ, చట్టసభల్లోనూ పోషించిన పాత్రను పదేపదే చర్చకు వస్తున్నాయి.

ఉక్కు మనిషి

- కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా నరసాపురం ఎంపీ శ్రీనివాసవర్మ
- విశాఖ ఉక్కు పరిశ్రమతోపాటు, జిల్లాకు ప్రయోజనాలెన్నో..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రధాని నరేంద్ర మోదీ తన మంత్రి వర్గంలో నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రిగా నియమించారు. ఈ నియామకంపై జిల్లావాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంతోపాటు, జిల్లా అభివృద్ధికి ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు. పశ్చిమలో చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేవు. ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకులోనే కొద్దిపాటి పరిశ్రమలున్నాయి. విదేశాలకు ఎగుమతులు చేసే లేసు పరిశ్రమ నర్సాపురం ప్రాంతంలో గతంలో మంచి జోష్ మీద ఉండేది. ఇప్పుడది పతనమైంది. లేసు పరిశ్రమకు మళ్లీ మంచి రోజులు రావాలంటే కేంద్ర సహకారం అవసరం. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో పంటలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లకు ప్రయోజనకరంగా ఉంటాయి. డెల్టాలో ఆక్వా రంగం అభివృద్ధి చెందింది. ఆ రంగంలోనూ మరిన్ని యూనిట్ల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం రాయితీలతో యూనిట్లు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. విదేశాలకు ఎగుమతులు జోరందుకోనున్నాయి.

మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న, పామాయిల్ పంటలకు ప్రసిద్ధి. వాణిజ్య పంటలైన మొక్కజొన్న, పామాయిల్‌కు సంబంధించి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పే వీలు వుంటుంది. మరోవైపు సిలికాన్ పరిశ్రమల ఏర్పాటుకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉన్నప్పుడు గతంలోనే ప్రణాళిక రూపొందించారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మెట్టలో సిలికాన్ పరిశ్రమలకు ఆస్కారం ఉంటుంది. ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు ప్రధాని మోదీ విశాఖ పట్నం-చెన్నయ్ పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమల ఊసే లేకుండాపోయింది. పశ్చిమలో చిన్నపాటి ప్రాజెక్ట్‌లకు నివేదికలు తయారు చేసి అధికారులు పంపినా సరే ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో జిల్లాలోనూ పరిశ్రమల అభివృద్ధికి అవకాశాలు వున్నాయి. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయమంత్రిగా వర్మ నియమితులు కావడంతో రాష్ట్రంతోపాటు, జిల్లాలోనూ పరిశ్రమలు అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



ఢిల్లీలో కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరసాపురం ఎంపీ శ్రీనివాసవర్మను ఎమ్మెల్యే నాయకర్ సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. అంతకు ముందు మరో మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతోపాటు పలువురిని కలిశారు.

విశాఖ ఉక్కు కీలకం

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. పూర్తి స్థాయి ఉత్పత్తి జరగడం లేదు. అందుకు అవసరమైన నిధులు, ముడిపదార్థాలు లేవు. రాష్ట్రం ఏర్పాటయ్యాక కేంద్రంలో ఉక్కు శాఖమంత్రి పదవి తొలిసారి లభించింది. దక్షిణ భారతదేశంలో తీర ప్రాంతానవున్న ఏకైక ప్రభుత్వ కర్మాగారం ఇదే. ఇక్కడ ఏడాదికి 80 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయవచ్చు. దీని ద్వారా రూ.50 వేల కోట్ల ఆదాయం వస్తుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్‌టీ ద్వారా 18 శాతం అంటే రూ.9 వేల కోట్లు ఆదాయం వస్తుంది. ఇవన్నీ జరగాలంటే స్టీల్ ప్లాంటు నిర్వహణకు అవసరమైన నిర్వహణ మూలధనం సమకూర్చాలి. బ్యాంకుల నుంచి రుణం దొరకడానికి రాష్ట్రపతి పేరిట ఉన్న ఉక్కు భూములను ఆర్‌ఐఎన్ఎల్ పేరిట మార్పించాలి. అప్పుడే సంస్థకు ఆర్థిక పరపతి పెరిగి మార్కెట్‌లో రుణాలు లభిస్తాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాలి. దీనివల్ల మంచి జరుగుతుంది. మంత్రి మనవారే కావడం వల్ల ఇవన్నీ సులువు అవుతాయి. వైసీపీ హయాంలో ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు అంగీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తేనే ప్రైవేటీకరణ సాధ్యం. ఈ విషయాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రైవేటీకరణ కసరత్తును ఆపలేకపోయింది. పైగా సానుకూలత చూపింది. జిల్లాలోనూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలు సాగాయి. వర్మకు ఉక్కు మంత్రిత్వ శాఖ బాధ్యతలు అప్పగించడంతో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిచిపోవడంతోపాటు, లాభాలబాట పట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కడపలోనూ టీడీపీ గతంలో ఉక్కు పరిశ్రమలను స్థాపించాలని భావించింది. వైసీపీ హయాంలో శంకుస్థాపన చేశారు. అయినా అమలుకు నోచుకోలేదు. అది సాకారమయ్యేందుకు అవకాశాలున్నాయి.

మహిళలకు ఉచిత ప్రయాణం!



- ఆర్టీసీ బస్సుల్లో రోజుకు 30 శాతం మంది మహిళల ప్రయాణం
- అధికారుల కసరత్తు.. చంద్రబాబు ప్రమాణ స్వీకారం తర్వాత స్పష్టత

భీమవరం టౌన్, జూన్ 10: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆడపడుచులకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు పై కసరత్తు మొదలైంది. ఈ నెల 12న కొలువు తీరనున్న ప్రభుత్వ ఏర్పాటు తర్వాత సీఎం చంద్రబాబు తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టిన తర్వాత, సూపర్‌సిక్స్‌పై దృష్టి పెట్టనున్నారు. ఇందులో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. దీని అమలుపై ఉన్నతాధికారులు తగిన ప్రణాళికను సిద్ధం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు రోజుకు 30 శాతం మంది ప్రయాణిస్తున్నట్టు అంచనా వేశారు. జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల్లో 301 బస్సులు ఉన్నాయి. ఇందులో ఆర్టీసీకి చెందినవి 224 కాగా 77 అద్దె బస్సులు. ఆయా మార్గాల్లో ఈ బస్సులు సరిపోతాయా ? లేక మరిన్ని పెంచాలా ? అనే అంశంపై చర్చిస్తున్నారు. మరోవైపు ఈ ఉచిత ప్రయాణం జిల్లాకే పరిమితం చేస్తారన్న చర్చ నడుస్తోంది. దీనిపై ఈ నెల 12 తర్వాత స్పష్టత రానుంది. ఉచిత టికెట్టు నమోదుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నారు. ఆధార్ కార్డులోని చివరి నాలుగు అంకెలను నమోదు చేసి, టికెట్ ఇవ్వనున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వద్దని జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ముందే ఆటో డ్రైవర్లు ఆందోళన చేశారు. వీరికి ఇబ్బందులు కలుగకుండా ఎలాంటి విధానం అమలు చేస్తారో చూడాల్సి వుంది.

డిపోల వారీగా.. రోజుకు ఆదాయం

భీమవరం	13.00 లక్షలు
తణుకు డిపోకు	10.00 లక్షలు
తాడేపల్లిగూడెం	7.50 లక్షలు
నరసాపురం	6.00 లక్షలు

సార్వాకు సన్నద్ధం..

- జిల్లాలో 2.11 లక్షల ఎకరాల సాగుకు ప్రణాళిక.. మెట్టలో 894 ఎకరాలలో నారుమళ్లు పూర్తి
- రెండు రోజుల్లో డెల్టాలో నారుమడులు



భీమవరం రూరల్, జూన్ 10 : సార్వా సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. కాల్వలకు నీరు రావడం, తొలకరి జల్లులు పడడం సాగుకు అనుకూలంగా మారింది. జిల్లాలో 2 లక్షల 11 వేల ఎకరాల్లో సార్వా చేపట్టారు. సాగుకు 5,100 ఎకరాల్లో నారు మడులు పోయాలి. డెల్టాలో రెండు, మూడు రోజుల్లో నారుమడులు వేసేలా రైతులు ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే మెట్టలో 894 ఎకరాల్లో నారుమడులు పూర్తయ్యాయి. నారుమడుల కోసం జిల్లా వ్యవసాయాధికారులు 48,500 క్వింటాళ్ళ విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు చెబుతున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో 1800 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రైవేటు సంస్థల నుంచి 4,500 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అవసరమైతే అందించేలా వ్యవసాయశాఖ ఏర్పాటు చేసుకుంది. ఈ నెల 15 నుంచి డెల్టాలో సార్వా నారుమడులు ముమ్మరం చేసి జూలై మూడో వారంలోపు నారుమడులు ప్రక్రియ ముగిసిపోవాలనే అంచనాలో వ్యవసాయశాఖ ఉంది. గతేడాది చివరిలో తుఫాన్ దెబ్బకు 60 శాతం సాగు 50 వేల హెక్టార్ల సాగు ఎక్కువ దెబ్బ తిన్నందున రైతులు ఈ ఏడాది సార్వా ముందస్తుగా సాగించాలనే ఆలోచనలో ఉన్నారు. సార్వాలో ఎంటీయూ 1318 రకం, సంపత్ స్వర్ణ రకం, స్వర్ణ రకం, 1061 రకం వరి వంగడాలు ఎక్కువ సాగు చేయనున్నారు. 1123 రకం కూడా కొన్నిచోట్ల చేపట్టనున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నారుమడులు దమ్ములు చేస్తున్నారు. ఈ నెలాఖరుకి నారుమడులు పూర్తయ్యే అవకాశం ఉంది.



గట్టు ఓకేనా..?

-5లో

గోదావరిలో మునిగి తల్లీ కొడుకు మృత్యువాత

జల్లేరు వాగులో పడి యువకుడి మృతి -5లో



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

జీవో 117 ఉత్తర్వులు రద్దు చేయాలి : యూటీఎఫ్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ఆటంకంగా వున్న జీవో 117 ఉత్తర్వులను రాష్ట్రంలో నూతనంగా కొలువు దీర నున్న కూటమి ప్రభుత్వం రద్దుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరులోని సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిన ప్రభుత్వాన్ని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించారని, కొత్తగా ఏర్పడ నున్న ప్రభుత్వంపై విద్యావ్యవస్థను బాగుచేసే బాధ్యత ఉందన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ అంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వాలను మార్చేశక్తి ఉందని మరోసారి ఈ ఎన్నికలు రుజువు చేశాయని వివరించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు షేక్ ముస్తఫా అలీ, సుభాషిణి, రంగాచారి, శ్యాంబాబు, వెంకటేశ్వరరావు, రంగమోహన్, విక్టర్, రాజు, అనురాధ, రాంబాబు, సుధారాణి, కమల్‌కుమార్, మోహన్‌రావు, దేవానందరావు, బేతాళరావు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'నీట్ యూజీ' అవకతవకలపై విచారణ జరపాలి : పీడీఎస్‌యూ

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 10 : దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్ష నిర్వహణ, ఫలితాలపై సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాని, మహర్షి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాది మే 5న జరిగిన నీట్ యూజీ పరీక్షను దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు రాయగా, ఈ పరీక్షను సక్రమంగా నిర్వహించక పోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆరోపించారు. ఈ పరీక్ష జరిగిన కేంద్రాల్లో ఉత్తర భారతదేశంలోని ఒకే కేంద్రంలో 8 మందికి ఫస్ట్ ర్యాంకు రావడం, ఏకంగా 67 మందికి 720/720 మార్కులు రావడాన్ని గమనిస్తే మార్కుల్లో అవకతవకలు జరిగినట్టుగా భావించాల్సి వస్తోంద న్నారు. ఎన్‌టీఏ తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నీట్ యూజీ పరీక్ష ఫలితాలు ఈ నెల 14న ప్రకటించాల్సి ఉండగా, అంతకంటే ముందుగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజే అంటే ఈనెల 4న హడా వుడిగా ప్రకటించడం.. అక్రమాలను కప్పి బెట్టేందు కేనని ఆరోపించారు. నీట్ యూజీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్‌పై జరుగుతున్న ఆందోళనలకు ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ చేసిన ప్రకటన చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష 4,750 కేంద్రాల్లో నిర్వహించగా, కేవలం 6 కేంద్రాల్లో మాత్రమే సమస్యలు తలెత్తాయని చెప్పడం దుర్మా ర్గమన్నారు. పలు పరీక్షా కేంద్రాల్లో లాంగ్వేజ్, వేరే ప్రశ్నాపత్రాల పంపిణీ జరిగిందని వివరించారు.నీట్ పరీక్షను లీకేజీలకు, ప్యాకేజీలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించని వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, అదే సమ యంలో పరీక్ష రాసిన అభ్యర్థులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీట్ యూజీ అవకతవకలపై విచారణ జరిపి, మరోసారి నీట్‌ను నిర్వహించి లక్షలాదిమంది విద్యార్థులకు న్యాయంచేయాలని లేని పక్షంలో పీడీఎస్‌యూ తరఫున విద్యార్థుల పక్షాన ఆందోళనా కార్యక్రమాలను చేపడతామని సంఘ నాయకులు హెచ్చరించారు.

పంచాయతీలకు మంచిరోజులు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కడలి గోపాలరావు

ఏలూరు రూరల్, జూన్ 10: కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో రాష్ట్రంలోని గ్రామ పంచా యతీ లకు పూర్వవైభవం రానున్న దని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్య క్షుడు కడలి గోపాలరావు హర్షం ప్రకటించారు. రాష్ట్రంలో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి అధి కారంలోకి వచ్చి ఉంటే గ్రామాలు శిథిలమై పోయేవన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్ప కూలిపోయేద న్నారు. రాష్ట్రప్రజలు విజ్ఞతతో ఓటు వేయడంతో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిందని, రాష్ట్రంలో పంచాయతీలు పూర్వవైభవం సాధిస్తాయన్నారు. వైసీపీ హయాంలో సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని, నిధులను సైతం బ్యాంకు ఖాతాల నుంచి అపహరించిన చరిత్రహీనుడు జగన్ అని విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకు గ్రామాల్లో విలువ లేకుండా చేశాడన్నారు. 14,15 ఆర్థిక సంఘం నిధులు సైతం వేలకోట్లు దారి మళ్ళించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థల వల్ల గ్రామ పంచాయతీ వ్యవస్థ జగన్ కారణంగా పతనమైందన్నారు. సర్పంచ్ హక్కులను సైతం కాల రాసిందని మండిపడ్డారు. పంచాయతీలు చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి దిశగా పయనించాయని, తిరిగి చంద్రబాబు సారథ్యంలో పంచా యతీలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. వైసీపీ హయాంలో 16 సమ స్యలపై పోరాటం చేశామని అయినా చలనం లేదన్నారు. సర్పంచ్‌లు జగన్‌ను ఓడించారని,ప్రజలు విజ్ఞతతో ఓటువేసి కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు.

మా ఇంటిని అప్పగించండి


బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న ఇంటి యజమానులు

కాళ్ల (ఉండి), జూన్ 10: తమ ఇంటిని అద్దెకు తీసుకున్న సమయం ముగి సినా తమ భవనాన్ని ఖాళీ చేయకుండా బ్యాంక్ ఉద్యోగులు కాలయాపన చేస్తున్నారని ఇంటి యజమానురాలు బండారు దుర్గాంబ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం కాళ్లలో బ్యాంకు ముందు ఆందోళనకు దిగారు. ఆమె మాట్లాడుతూ 2014లో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి వ్యాపార కార్యకలాపాల నిమిత్తం పది సంవత్సరాలు కాలానికి అద్దెకు ఇచ్చామన్నారు. లీజు గడువు మార్చి నెలాఖరుతో ముగిసిందన్నారు. దివ్యాంగురాలిని కావడంతో అనారోగ్య కారణాలతో పైఅంతస్తు నుంచి కిందకుపైకి ఎక్కేం దుకు ఇబ్బందులు పడుతున్నానని భవనాన్ని ఖాళీ చేసి అప్పగించాలని బ్యాంక్ మేనేజరుకు అనేక సార్లు మొరపెట్టుకున్న సరైన సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు



జీలుగుమిల్లి, జూన్ 10: గుట్టుచప్పుడు కాకుండా చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. మండలంలో లంకాలపల్లి, పి.అంకంపాలెం గ్రామాల్లో జేసీబీతో మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. అధికారులు నూతన ప్రభుత్వం ఏర్పడే లోపు శాఖా పరమైన పనులు చక్కదిద్దే పనిలో పడ్డారు.దీంతో గిరిజన గ్రామాల్లో అక్రమ మట్టి మాఫియా ఆగడాలు పెరిగాయి. కుటమి ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం ఇసుక, మట్టి అవసరాలు తీరేందుకు అను మతులు వస్తాయని మరికొందరు వేచి చూస్తున్నారు.

ఎన్టీఆర్ పాలిటెక్నిక్ కళాశాలగా పేరు మార్పు



కలిదిండి, జూన్ 10 : ఏలూరు జిల్లా కలిదిండి మండలం వెంకటా పురంలో వైఎస్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బోర్డులో వైఎస్ ఆర్ పేరును టీడీపీ నాయకులు సోమవారం తొలగించారు. టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉండగా ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాలకు వైఎస్ఆర్ పేరు అనధికారికంగా పెట్టారన్నారు. కూటమి అధికారంలోకి రావడంతో ఆ పేరును తొలగించి ఎన్టీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలగా బోర్డు ఏర్పాటు చేశామన్నారు. శిలాఫలకాలు ధ్వంసం చేశామని వార్తలు వెలువడడం అవాస్తవమన్నారు. టీడీపీ నాయకులు కొలా శ్రీకాంత్, గూడవల్లి శ్రీనివాసరావు, దాసరి బెనర్జీ, సానబోయిన విష్ణుమూర్తి, గూడపాటి శివరామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, కురేళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ భవనాలకు ఇక..మోక్షం ?

వైసీపీ హయాంలో నిలిచిపోయిన నిర్మాణాలు

తాడేపల్లిగూడెంలో మధ్యలోనే ఆగిన పనులు

కొత్త ప్రభుత్వంలో ముందుకు వెళతాయని స్థానికుల అభిప్రాయం

సొంత నిధులతోనే అగ్నిమాపక కేంద్రం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 10: తాడేపల్లిగూడెంలో గత ఎన్నికల ముందు మధ్యలో నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలు, అభివృద్ధి పనులకు మోక్షం కలగనున్నది. ఐదేళ్ల క్రితం ఏ స్థాయిలో ఉన్నాయో ఆ భవనాలు నేటికీ అలానే ఉన్నాయి. అవి బూత్ బంగ్లాలుగా మారాయి. తాడేపల్లిగూడెంలోని తహసీల్దార్ కార్యాలయం, కడకట్ల ప్రాంతం లోని స్విమ్మింగ్ పూల్, గణేష్ నగర్ వద్ద ఇండోర్ స్టేడియం సగం పనులు అయిన తరువాత మధ్యలోనే వదిలేశారు. దీంతో కొత్త ప్రభుత్వం అయినా వీటికి మోక్షం కలిగిస్తుందని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

ఇరుకు గదిలో రెవెన్యూ సేవలు

బ్రిటిష్ హయాంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో వర్షం పడితే రెవెన్యూ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో గత టీడీపీ హయాంలో రూ. కోటితో నూతన భవన నిర్మాణానికి అప్పటి మంత్రి పైడికొండల మాణిక్యాలరావు నిధులు తీసుకొచ్చి శంకుస్థాపన చేయడంతో పాటు సగానికి పైగా పనులు పూర్తిచేశారు. తరువాత ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. దీంతో టీడీపీ హయాంలోనే రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్మించిన డేటా సెంటర్‌లోనే ఐదేళ్లుగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. మధ్యలో తాడేపల్లిగూడేనికి ఆర్డీవో కార్యాలయం మంజూరు కాగా ఆ కార్యాలయం కూడా కొన్నాళ్లు అదే కార్యాలయంలో పనిచేసింది. ఇంత ఇబ్బంది పడుతున్నా పాలకులు ఈ కార్యాలయం వైపు కన్నెత్తికూడా చూడలేదు. దీంతో ఏళ్ల తరబడి ఇరుకు గదిలోనే సేవలందించారు.


స్విమ్మింగ్ పూల్ పరిస్థితి ఇది

స్విమ్మింగ్‌పూల్ చుట్టూ తుప్పలు

తాడేపల్లిగూడెం పట్టణంకు చేర్చి కాలువ వెళ్తున్నా ఆ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లి చాలామంది యువకులు మృత్యువాత పడుతున్నారని టీడీపీ ప్రభుత్వంలో రూ.1.30 కోట్లతో కడకట్ల ప్రాంతంలో సుందరంగా స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించి పనులు చేపట్టగా ఆ పనులు కూడా జగన్ సర్కార్ పట్టించు కోలేదు. ఫలితంగా ఐదేళ్లుగా స్విమ్మింగ్‌పూల్ చుట్టూ తుప్పలు, పాములు చేరుతున్నాయి. ఎన్నికల ముందు ఎలా అయితే ఉందో నేటికీ ఆ భవనం అలానే ఉంది.


నిలిచిన ఇండోర్ స్టేడియం

ముందుకు సాగని ఇండోర్ స్టేడియం

తాడేపల్లిగూడెంలో ఏళ్ల తరబడి యువత, ప్రజలకు స్టేడియంగా ఉపయోగ పడిన విమానాశ్రయ రన్‌వే ప్రాంతంలో ఏపీ నిట్ నిర్మించడంతో యువత ఆడు కునేందుకు సరైన ఆట స్థలం లేదని భావించి టీడీపీ హయాంలో అప్పటి నాయకులు ముందు చూపుతో రూ.2 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే స్టేడియం పనులు చేపట్టకుండా వదిలేశారు. పట్టణంలో యువతకు ఆడుకునేందుకు ఆట స్థలాలే లేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు దీన్ని వ్యాపార మార్గాలుగా మలచుకుని ఖాళీ స్థలాల్లో నెట్ స్టేడియాలు ఏర్పాటు చేసి గంటకు రూ.500 నుంచి 800 వరకూ వసూలు చేస్తూ క్యాష్ చేసుకుంటున్నారు.


మధ్యలో వదిలేసిన తహసీల్దార్ కార్యాలయం

సొంత నిధులతోనే అగ్నిమాపక కేంద్రం

ప్రమాదాలు సంభవించినప్పుడు, ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు సేవలం దించే అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి కూడా రూ.70 లక్షలతో పనులు చేపడితే ఆ పనులు కూడా చేయలేదు. దీంతో ఆ కార్యాలయం ఆర్‌అండ్‌బీ భవనాల వద్ద ఓ మూల ఏర్పాటు చేసుకుని సేవలందించారు. అయితే ఆర్‌అండ్‌బీ ప్రాంతంలో తరచూ అగ్నిమాపక వాహనం వల్ల ఇబ్బందులు వస్తుండటంతో విసిగిన అగ్నిమాపక అధికారి రామారావు ఉన్నతాధికారులకు తమ పరిస్థితి మొరపెట్టుకోగా రీజియన్‌లో అగ్నిమాపక కేంద్రానికి ఉన్న నిధులు ఈ నిర్మాణానికి మళ్లించి అగ్నిమాపక కేంద్రాన్ని పూర్తి చేసుకున్నారు.

కక్షతో ఏం సాధించారు..

కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రజలకు ఉపయోగ పడే నిర్మాణాలు చేపట్టిన ఏ ప్రభుత్వం అయినా వాటి అవసరం, ఉపయోగం గుర్తించి తరు వాత వచ్చిన ప్రభుత్వాలు కొనసాగిస్తే ప్రజాధనం వృథాకాదు. ప్రజలు వాటి ఫలాలు అందుకుంటారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఏ పనినీ కనీసం కన్నెత్తి చూడకపోవడంతో కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అయిందనూ విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.



కోతకు గురైన గట్టు వెంబడి వేసిన రాళ్లు.. కుంగిన ఏటిగట్టుకు తాత్కాలికంగా వేసిన అడ్డుకట్ట (ఫైల్ ఫొటో)

గట్టు ఓకేనా..?

నరసాపురం ప్రజల్లో వీడని భయం

230 మీటర్ల మేర పూర్తయిన పనులు

ఇంకా 170 మీటర్లు పెండింగ్

వరదొచ్చినా డోకా లేదంటున్న అధికారులు

నరసాపురం, జూన్ 10 : వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.27 కోట్లతో చేపట్టిన నరసాపురం ఏటిగట్టు పనుల్లో డొల్లతనం నాలుగుసార్లు బయట పడింది. 230 మీటర్ల గట్టు పటిష్ట పనులు పూర్త వగా, ఇంకా 170 మీటర్లు పెండింగ్‌లో ఉన్నాయి. వరద వచ్చినా గట్టుకు డోకా లేదని అధికారులు చెబుతున్నా, ప్రజల్లో మాత్రం భయం వీడడం లేదు. వేసిన రాళ్లు నాసి రకంగా ఉన్నాయని, వరద వస్తే ఏమవుతుందోనని ఆందోళన నెలకొంది. 2021 జూలైలో గోదావరికి భారీ వరదలు రావడంతో అమరేశ్వరస్వామి ఆలయం వద్ద ఏటిగట్టు కోతకు గురైంది. 400 మీటర్ల గట్టు కుంగిపోయింది. వరద తగ్గే వరకు ప్రజలు బిక్కు బిక్కుమంటూ గడిపారు. రూ.50 లక్షలతో తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ఆ తర్వాత 2022 నవంబర్‌లో సీఎం జగన్ నరసాపురం పర్యటనలో రూ.27 కోట్లతో గట్టు పటిష్ట పనులకు శంకుస్థాపన చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఈ పనులను ప్రారంభించారు. కోతకు గురైన ప్రాంతంలో రాళ్లను వేసి సుమారు వంద మీటర్ల మేర పటిష్ట పనులు చేపట్టారు. ఈ పనుల్లో నాసి రకం రాళ్ల వినియోగిస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు అప్పట్లో ఆరోపణలు చేశారు. దీనిని అధికార పార్టీ నేతలు కొట్టిపారేశారు. కానీ, నెల రోజుల్లోనే చేసిన పనులన్నీ గోదావరి పాలయ్యాయి. చిన్నపాటి నీటి ప్రవా హానికే గట్టు కుంగిపోయింది. ఇలా నాలుగుసార్లు, చేస్తున్న పనులన్నీ నీటి పాలవడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.ఈ నేపథ్యంలో జిల్లా పర్యటనకు విచ్చేసిన చంద్రబాబు ఈ పనుల్లో జరుగుతున్న డొల్లతనంపై గళం విప్పారు. ఇటు మాజీ ఎమ్మెల్యే బండారు రాష్ట్ర గవర్నర్‌తో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. రూ.27 కోట్లతో చేస్తున్న ఈ పనుల్లో అధికార పార్టీకి చెందిన నేతలు బినామీ కాంట్రాక్టర్లుగా వ్యవహ రిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ చేయిం చాలని డిమాండ్ చేశారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల బృందం ఈ పనులను పరిశీలించి అంతా ఓకేనంటూ సర్టిఫికెట్ ఇచ్చారు. వాడిన రాళ్లల్లో నాసి రకం లేవని తేల్చేశారు. పనులన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయంటూ ధ్రువీక రించారు. ఆ నిపుణుల బృందం ఇచ్చిన సూచ నల ప్రకారం అధికారులు పనులు చేపట్టారు. ఇప్పటి వరకు కోతకు గురైన 400 మీటర్లలో 230 మీటర్ల మేర పనులను పూర్తిచేశారు. ఐదు నెలల నుంచి ఎక్కడా కోతకు గురవ్వలేదు. దీంతో ఇక గట్టుకు ఢోకా లేదని అధికారులు చెబుతున్నారు. పెండింగ్‌లో వున్న 170 మీటర్లు ఇదే రీతిలో పూర్తి చేస్తామంటున్నారు.

ప్రజల్లో వీడని భయం

నాలుగుసార్లు కళ్ల ముందు చేసిన పనులు నీటిపాలవడాన్ని చూసిన ప్రజల్లో ఇంకా భయం వీడటం లేదు. గోదావరికి వరదొస్తే కానీ గట్టు బలం ఎంతో బయట పడుతుందని అంటున్నారు. గతంలో ఇదే తరహాలో పనులు చేశారు. అయితే అవి నిలబడలేదు. కొద్దిపాటి ప్రవాహానికే నీటిపాలయ్యాయి. మరో రెండు మూడు నెలల్లో గోదావరికి వరదలు వస్తాయి. ఆ వరదకు గోదారమ్మ దయవల్ల ఏమి కాకపోతే భయపడనవసరం లేదు.

ఆందోళన అవసరం లేదు

సాధారణంగా ఏటిగట్టు పనులు చేసేటప్పుడు గట్టు జారడం పరిపాటి. ఆ విధంగా నాలుగుసార్లు జారింది.ఆ ప్రాంతంలో లోతు ఎక్కువ. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇక్కడ 60 మీటర్ల మేర రాళ్లు వేసి పటిష్ట పరిచాం. దీనిపై గట్టు నిర్మాణం చేపట్టాం. వరదొచ్చినా ఎలాంటి ప్రమాదం ఉండదు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– సుబ్బారావు, ఏటిగట్ల అభివృద్ధి శాఖ ఏఈ


మద్ది అంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మద్ది హుండీ ఆదాయం రూ.52.63 లక్షలు

బుట్టాయగూడెం, జూన్ 10: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం గుర్వాయి గూడెం మద్ది అంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కిం చారు. తాడేపల్లిగూడెం తనిఖీదారు ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. 86 రోజులకు 52,63,285 రూపా యల ఆదాయం వచ్చినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. బంగారు వస్తువులు 21 గ్రాములు, వెండి 2.495 కేజీలు వచ్చినట్లు తెలిపారు.


ప్రగడవరం సచివాలయం-2ను సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించాలి

చింతలపూడి/లింగపాలెం జూన్ 10: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సూచిం చింది. సోమవారం లింగపాలెం మండలం కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలో గల ప్రగడవరం-2 సచివాలయాన్ని సందర్శించి జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. ప్రధానంగా బాలింతలకు, గర్భిణులకు సుఖ ప్రసవానికి మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా గణాంక అధికారి పి.శ్రీనివాసరావు అన్నారు. రక్తహీనత రాకుండా చేపడుతున్న చర్యలు సమీక్షించారు. పిల్లలకు ఇచ్చే వ్యాధినిరోధక టీకాలు, చిరువ్యాధుల చికిత్సలు, అంటువ్యాధులపై సమీక్షించారు. టాస్క్‌ఫోర్స్ బృందంలో పి.శ్రీనివాసరావు, జ్యోతి, సురేష్, భరత్, వెంకట్, స్థానిక సూపర్‌వైజర్ ఎస్.కె అబ్రార్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య



పెదవేగి, జూన్ 10 : మద్యానికి బానిసై సమయానికి ఇంటికి రాకుండా తిరుగుతున్న కుమారుడిని తల్లి మందలించడంతో ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. పెదవేగి ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగికి చెందిన బొట్ల రామారావు న్యాయంపల్లిలో ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవిస్తూ వేళకు ఇంటికి రాకుండా తిరుగు తున్నాడు. ఆదివారం కూడా ఇదే విధంగా మద్యం తాగి రాత్రి 11 గంటలు దాటిన తరువాత ఇంటికి వచ్చాడు. దీంతో అతని తల్లి మందలించింది. "మీనాన్న చనిపోయాడు. నువ్వేమో మద్యానికి బానిసై ఇలా తిరుగుతున్నావంటూ తల్లి వెంకటేశ్వరమ్మ మందలించంతో మనస్తాపానికి గురైన రామారావు ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం పామాయిల్ ఫ్యాక్టరీ సమీపంలో పొలంలో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చిరు వ్యాపారి మృతి



పెనుగొండ, జూన్ 10: రహదారి ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన పెనుగొండ మండలం దొంగరావిపాలెం జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన వీరవల్లి వెంకటపతి (75) కత్తిపీటలు అమ్ముతూ ఉంటారు.వ్యాపారం నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెలుతుండగా దొంగ రావిపాలెం వద్ద జాతీయ రహదారి దాటు తుండగా పెరవలి వైపు నుంచి రావులపాలెం వైపు వెలుతున్న కారు వేగంగా ఢీ కొట్టడంతో వెంకటాపతికి తలకు బలమైన గాయం అయ్యిందన్నారు. హైవే అంబులెన్స్‌లో తణుకు ఆసుపత్రికి తర లించగా అప్పటికే మృతి చెందాడన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నకట్టు పెనుగొండ ఎస్ఐ షేక్ సుభాని తెలిపారు. మృతు నికి భార్య , కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఉంగుటూరు, జూన్ 10 : ఉంగుటూరు మండలం కైకరంలో కుటుంబ కలహాల కారణంగా పోతురాజుల శిరీష (24) పురుగుల మందు తాగగా ఆదివారం రాత్రి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గత నెల 22వ తేదీన పురుగుల మందు తాగగా ఆమెను తణుకు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.కోలుకున్న ఆమెను భర్త శాంతరాజు, కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చారు. అయితే మరలా అస్వస్థతకు గురవడంతో ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విష మించడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది.ఆమెకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. శిరీష కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

దైవ దర్శనాలకు వెళ్లి..

గోదావరిలో మునిగి తల్లీ కొడుకు మృతి

జల్లేరువాగులో పడి యువకుడు..


తల్లి, కొడుకుల మృతదేహాలు


నాగమణి, శ్రీనివాస్ (ఫైల్)

వేలేరుపాడు, జూన్ 10 : ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని కట్కూరు శైవక్షేత్రంలోని శివుని దర్శనానికి సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర అశ్వారావుపేట చిన్నంశెట్టి బజారుకు చెందిన పది మంది కుటుంబ సభ్యులు వచ్చారు. సమీపంలోని గోదావరి నదిలో స్నానం చేసిన అనంతరం దైవదర్శనం చేసుకోవాలని గోదావరిలోకి దిగారు. ఈ క్రమంలో అల్లంశెట్టి నాగమణి (45),ఆమె కుమారుడు తేజా శ్రీనివాస్ (23) ప్రమాదవశాత్తూ మునిగిపోయారు. వీరిని రక్షించేందుకు నాగమణి భర్త, ఇతర బంధువులు ప్రయత్నాలు చేసినప్పటికి అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో క్షణాల్లోనే నదిలో మునిగి గల్లంతయ్యారు. ఈ విషయాన్ని బంధువులు కట్కూరు గ్రామస్థులకు తెలపడంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని నదిలో గాలించినప్పటికి గల్లంతైనవారి ఆచూకీ లభించలేదు.సమాచారం అందుకున్న వేలేరుపాడు ఎస్సై లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శ్రీహరి తమ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని స్థానికంగా ఉన్న చేపల బోట్లు, గజ ఈతగాళ్ళతో నదిలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రానికి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాలను జంగా రెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. తల్లి, కుమారుడు మృతితో బంధువులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. నాగమణి దంపతులు అశ్వారావుపేటలో జ్యూస్ బండి నిర్వహి స్తుండగా కుమారుడు శ్రీనివాస్ స్థానిక ఓ దుకాణంలో పని చేస్తున్నాడు.

జల్లేరులో గల్లంతైన యువకుడి మృతి



కదారి సాయికుమార్ మృతదేహం.. సాయికుమార్ (ఫైల్ ఫొటో)

బుట్టాయగూడెం, జూన్ 10 : బుట్టాయగూడెం మండలం జల్లేరు జలా శయంలో కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన కదారి దుర్గా సాయికుమార్ ఆదివారం చీకటిపడిన తర్వాత గల్లంతవగా అతని మృతదేహాన్ని సోమవారం ఉదయం పోలీసులు బయటకు తీశారు. దుర్గాసాయి కుమార్ ఏడుగురు స్నేహితులతో కలిసి ఆదివారం గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లాడు. దర్శనం తర్వాత ఇంటికి వెళుతూ దొరమామిడి డ్యామ్‌లో స్నానం చేయడానికి జలాశయంలోకి దిగాడు. ఈత రాకపోవడంతో జలాశయంలో గల్లంతయ్యాడు. చీకటి పడేవరకు స్నేహితులు ప్రయత్నాలు చేసినా ఆచూకీ లభించ లేదు. దీంతో మృతుని తండ్రికి సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టి మృత దేహాన్ని వెలికితీశారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తర లించారు. హెచ్‌సీ జి.కృష్ణంరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విలేకరిపై దాడి చేసిన సర్పంచ్‌పై కేసు నమోదు

ద్వారకాతిరుమల, జూన్ 10: టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు చేస్తున్న దాడిని చిత్రీకరిస్తున్న విలేఖరిపై దాడి చేసిన సర్పంచ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఈనెల 4న ద్వారకాతిరుమల మండలం దొరసాని పాడులో టీడీపీ కార్యకర్తలపై వైసీపీకి చెందిన కొందరు దాడి చేశారు.ఈ దాడిని స్థానిక పత్రికా విలేకరి బ్రహ్మయ్య తన సెల్‌ఫోన్ ద్వారా వీడియో తీస్తుండగా సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజు ఫోన్ లాక్కుని విసిరేశాడు. అంతేకాకుండా ఖాళీ కూల్‌డ్రింక్ సీసాతో దాడి చేశాడు. తలపై గాయం అవడంతో అతడిని స్థానిక పీహెచ్‌సీకి తీసుకు వెళ్లి ప్రాథమిక చికిత్స అదించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ప్లాస్టిక్ కనికలు తయారీ ఫ్యాక్టరీకి అనుమతులివ్వద్దు

ఆకివీడు, జూన్ 10: కాలుష్యాన్ని వెదజల్లే ప్లాస్టిక్ కనికలు తయారీ కంపెనీకి అనుమతి ఇవ్వొద్దని సమతానగర్ వాసుల నగర పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలుపుతూ కమిషనర్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా మూతబడిన రైస్‌మిల్లులో ప్లాస్టిక్ వ్యర్థాలను కరిగించి కనికలుగా తయారు చేయడం వలన తాము పలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడతామని ఆందోళన వ్యక్తం చేశారు. భైరి ఆంజనేయులు, డి.కళ్యాణి ఉన్నారు.

ఫ్యాక్టరీ మూసివేయడం అన్యాయం

గణపవరం, జూన్ 10: సీపీఎఫ్ రొయ్యల మేతల కంపెనీని మూసివేయడం అన్యాయమని పశ్చిమ గోదావరి జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. ఉద్యోగులు, ఫ్యాక్టరీ వద్ద సోమవారం కార్మికులకు మద్దతు ప్రకటించారు. పదకొండేళ్లుగా పని చేస్తున్న ఉద్యోగుల, కార్మికులపై తొలగించాలని ప్రకటించడం అన్యాయమన్నారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎం.పెంటారావు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు చేయండి

పాలకోడేరు, జూన్ 10: గర్భిణులను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే సుఖ ప్రసవాలు జరిగే విధంగా చూడాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావు సూచించారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ రంగం నాయుడు, డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్మరాజుకు ఉపాధ్యాయుల సత్కారం

గణపవరం, జూన్ 10: స్థానిక చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించాలని ఉంగుటూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన పత్సమట్ల ధర్మరాజును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి, వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, సీనియర్ అధ్యాపకుడు అక్కిరాజు, శారదాదేవి కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ధర్మరాజును పూలమాలతో సత్కరించారు.

సీఆర్పీఎఫ్ జవాన్ సాంబశివరావుకు నివాళి

తణుకు, జూన్ 10: తణుకు పట్టణానికి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ పగడాల సాంబశివరావు సేవలు మరవలేనివని పలువురు పోలీసు అధికారులు అన్నారు. 1998లో నక్సలైట్ల మందు పాతర పేలి ప్రాణాలు విడిచిన పగడాల సాంబశివరావు చిత్రపటానికి సోమవారం 27వ వార్డులోని గ్రామ సచివాలయంలో పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ పోలీసులు పగడాల లక్ష్మి, గోపిరెడ్డి చిన్నారావు, పగడాల రిషికేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 12 వరకు బస్ పాసులు మంజూరు

తణుకు, జూన్ 10: విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా బస్ పాసులు మంజూరు చేస్తున్నట్టు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు రాయితీపై బస్సు పాసులు 20 కిలోమీటర్ల పరిధిలో ఏడో తరగతి వరకు బాలురకు, పదో తరగతి వరకు బాలికలకు ఏడాదికి రూ.50 రుసుంతో పాసులు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థులు డిపోలోని కౌంటర్‌లో స్టడీ సర్టిఫికెట్, ఫొటో, ఆధార్ కార్డు జిరాక్సు కాపీలు ఇచ్చి పాసులు పొందవచ్చన్నారు. ఈ నెల 12 నుంచి పాసులు మంజూరు చేస్తామన్నారు.

తాడేరు సహకార సంఘం త్రిసభ్య కమిటీ రాజీనామా

భీమవరం రూరల్, జూన్ 10 : తాడేరు సహకార సంఘం త్రిసభ్య కమిటీ రాజీనామా చేసినట్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. సంఘ ఛైర్మన్ కొట్టి త్రినాథ్, సభ్యులు రాజీనామా పత్రాలను సహకార సంఘం కార్యదర్శి నందమూరి సుబ్బారావుకు అందజేశారు.

కరాటే విజేతకు ఆరిమిల్లి అభినందన


కార్తికేయను అభినందిస్తున్న ఎమ్మెల్యే

తణుకు, జూన్ 10: పట్టణానికి చెందిన పసుపులేటి భాస్కర్ కుమారుడు లాస్య తేజ్ కార్తికేయ మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల నేపాల్‌లో జరిగిన కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన కార్తికేయ ఎమ్మెల్యే ఆరిమిల్లిని మర్యాద పూర్వకంగా కలవడంతో ఆయన అభినందించారు.

రామోజీరావు సేవలు మరువలేనివి


రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దెందులూరు, జూన్ 10: ఈనాడు దినపత్రిక, రామోజీ ఫిల్మ్ సిటీ, మార్గదర్శి, ప్రియ పచ్చళ్ల వంటి సంస్థల ద్వారా రామోజీరావు అందించిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. సోమవారం దెందులూరులో ప్రజలంతా కలసి రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. రామోజీ మరణం తీరని లోటన్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. రామోజీ నీతి నిజాయితీని, ఆశయాలను ప్రజలు పాటించి, ఉన్నతంగా ఎదగాలని కోరారు. ప్రగతి విద్యా సంస్థల డైరెక్టరు ఎంఎస్ఆర్ ఆంజనేయులు (ప్రగతి రాజా), మొటపర్తి రాజా, మేడిది నికోల, దేవినేని తులసీదాసు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 10: గ్రామాల్లో ప్రతి ఇంటా ఒక మొక్క నాటితే భావితరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణం అందించవచ్చని సర్పంచ్ పిల్లా రాంబాబు కోరారు. మండలంలోని దండగర్ర శివారు లింగారాయుడుగూడెం ఉప సర్పంచ్ కాసగాని రాంబాబు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

పాలకొల్లు అర్బన్, జూన్ 10 : స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్ పాసైన విద్యార్థినుల నుంచి డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలపారు. తమ కళాశాలకు నాక్ ప్లస్‌ప్లస్ గుర్తింపు లభించిందని, బీఏ ఎకనామిక్స్ (మేజర్), బీఎస్సీ, ఎంపీసీఎస్ కంప్యూటర్స్ (మేజర్), బీకాం కంప్యూటర్స్ (మేజర్) కోర్సుల్లో ప్రవేశా నికి ఇంటర్ పాసైన విద్యార్థినులు అర్హులన్నారు. విద్యార్థినులు రెండు పాస్ పోర్టు సైజు ఫోటోలు, ఆధార్ కార్డు, ఇంటర్, మార్కుల లిస్టు, టీసీ, 10వ తరగత మార్కుల లిస్టు ఒరిజనల్, ఫోటో స్టాట్ కాపీలు తీసుకు రావలసి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 63021 94657, 74065 47372 సంప్రదించ వచ్చునని తెలిపారు.

పెరిగిన పొలం లీజు ఆదాయం

భీమవరం టౌన్, జూన్ 10: గునుపూడిలోని పంచారామ క్షేత్రమైన శ్రీ సోమేశ్వర జనార్దన స్వామివార్ల దేవస్థానం హక్కు భుక్తములో యున్న 87 ఎకరాల 71 సెంట్లు (27 ప్లాట్స్) వ్యవసాయ భూమికి మూడేళ్ల కాలానికి టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించగా, 34 ఎకరాల 92 (10 ప్లాట్స్) బహిరంగ వేలంలో లీజుకు ఇవ్వగా గతంలో రూ.10 లక్షల 50 వేలు ఆదాయం రాగా ప్రస్తుతం రూ.10 లక్షల 72 వేలు ఆదాయం వచ్చిందని ఆలయ ఇవో రామకృష్ణంరాజు తెలిపారు.

ధాన్యం సొమ్ములు చెల్లించాలని రైతుల ఆందోళన

కౌలు రైతు సంఘం నాయకుల డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు

భీమవరం రూరల్, జూన్ 10 : రైతులు ధాన్యం అమ్మి దా దాపు రెండు నెలలు గడిచినా ఇంత వరకు ప్రభుత్వం రైతులకు ధాన్యం సొమ్ములు ఇవ్వలేని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు అన్నారు. ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లై కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ప్రభుత్వం నెలలు తరబడి ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పులకు అధిక వడ్డీలు కట్టి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జిల్లాలో దాదాపు 70 వేల మంది రైతులకు వెయ్యి కోట్ల రూపాయిలు వస్తాయని సమస్యను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ధాన్యం బకాయిలు వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. కౌలు రైతుల సంఘం నాయకులు కవురు శ్రీనివాస్, పిల్లి కామేశ్వరరావు, నెక్కంటి శ్రీనివాసు, చేబ్రోలు బాలాజీ, కొండేటి నర్సింహరావు, సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు వినతి

● ఆకివీడు : కొల్లేరు ప్రాంతంలో సాగు చేయలేక, వదులుకోలేక అవస్థలు పడుతున్నామని తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు రైతు నేరెళ్ల పెదబాబు వినతిపత్రం అందజేశారు. ఆర్బీకేకి ధాన్యం తోలిన రైతులకు ఏప్రిల్ 28 తరువాత సొమ్ములు నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సార్వ సాగుకు పెట్టుబడులు పెట్టాల్సిన సమయం ఆసన్నమైనందున రైతుల ఖాతాలకు నగదు జమ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పుటేరు, చినకాపవరం మురుగు కాల్వల పూడిక తీయించాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

● ఇరగవరం : ప్రభుత్వం ధాన్యం బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు పెట్టుబడులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా రైతు సంఘం కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు అన్నారు. తూర్పు విప్పర్రులో రైతులతో సమావేశం నిర్వహించారు. 40 రోజులు దాటుతున్నా రైతులను పట్టించుకోవడం లేదన్నారు. అప్పుచేసి వ్యవసాయం చేసిన రైతులు సాగంటేనే భయపడుతున్నారని ధాన్యం విక్రయించిన 25 రోజుల్లోనే బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పిన మాటలు క్షేత్రస్థాయిలో అమలు కాలేదన్నారు. అధికారులు వెంటనే రైతులను ఆదుకో వాలని నామన కోరారు.

దత్తాత్రేయుడే సర్వ జగద్రక్షకుడు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామ

ఆకివీడు, జూన్ 10: దత్తాత్రేయుడు సర్వజగద్రక్షకుడని ఎమ్మె ల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలుపొందిన ఆర్ఆర్ఆర్ మొదటిసారిగా సోమవారం స్థానిక దత్తక్షేత్రంలో దత్తుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఆయన వెంట తనయుడు భరత్ ఉన్నారు. బాలకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు కేక్ కట్ చేశారు. తన తండ్రి విజయం సందర్భంగా పట్టణంలో ఎమ్మెల్యే రఘురామ కుమారుడు భరత్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, టీడీపీ మండల,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, క్లస్టర్ ఇన్‌చార్జి గొంట్లా గణపతి, రాష్ట్ర రైతు నాయకుడు భూపతిరాజు తిమ్మరాజు, జనసేన,బీజేపీ పట్టణ అధ్యక్షులు పిల్లా బాబులు, జనసేన కన్వీనర్ కన్నబాబు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

అధికంగా నీరు వాడితే దిగుబడి తగ్గుతుంది

పెనుమంట్ర, జూన్ 10 : వరి సాగులో అవసరానికి మించి నీటిని వాడితే దిగుబడులు తగ్గిపోతాయని వరి పరిశోధన సహ సంచాలకులు డి.శ్రీనివాస్ అన్నారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంసలో వరిలో సుస్థిర సాగు విధానంపై రైతు, శాస్త్రవేత్తలతో వరిలో కర్బన ఉద్గారాలపై రైతుల భాగస్వామ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నర్సర్ ఫాం భారత దేశపు లీడ్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర రెడ్డి, టి.శ్రీనివాస్, మానుకొండ శ్రీనివాస్, కేఎం దక్షిణామూర్తి, పీహెచ్ శ్రీనివాస్ పలు అంశాలను వివరించారు.

విద్యతోనే దేశ ప్రగతి


విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న అంజిబాబు

భీమవరం టౌన్, జూన్ 10 : విద్యతోనే దేశ ప్రగతని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజి బాబు) అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయంలో తుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవనం ట్రస్టు సహకారంతో 20 మంది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించే కార్యక్రమం నిర్వహించారు. ట్రస్టు ఛైర్మన్ తుమ్మలపల్లి శివ మాట్లాడుతూ తమ తండ్రి స్వర్గీయ మంగారాజు పేరిట ప్రతి ఏటా పేద విద్యార్థులకు సహకారం అందిస్తున్నామని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పునరుద్ధరిస్తాం


పితానిని సత్కరిస్తున్న నాయకులు

పెనుమంట్ర, జూన్ 10 : ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పునరుద్ధ రిస్తా మని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరు మండలం కొమ్ము చిక్కాలలో సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆచంట నియోజకవర్గం ఎస్సీ సెల్ విభాగం అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ఆచంట నియోజకవర్గం టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బీరా నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. దళిత నాయకులు పితాని సత్యనారాయణను శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. నక్క వేదవ్యాస శాస్త్రి, శర్మ పొలమూరు రాజేష్, తానేటి మదన్, సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గన్ని రాజు, చింతపల్లి జేమ్సుసన్న మండ్ర సుధాకర్, నందమూరి సత్యనారాయణ, గంటా శ్రీను, పీతల బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య వారోత్సవాలు

ఆచంట, జూన్10 : పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్నారు. ఆచంటలో రోడ్డుపక్కన ఉన్న చెత్తను సోమవారం జేసీబీ సాయంతో తొలగించారు. పనులను ఈవోపీఆర్‌డీ మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి నాగబాబు పర్యవేక్షిస్తున్నారు.

● పెనుగొండ : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పెనుగొండ మండలం సిద్ధాంతం పంచాయతీ పరిధిలో పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త లేకుండా డంపింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు. మురుగు సమస్య అనేది ఉండకూడదన్నారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలన్నారు. సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో ఓవీ ఎస్ఎస్ శ్రీనివాస్, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస దొర, ఈవోపీఆర్‌డీ సీహెచ్‌వీ రెడ్డి, కార్యదర్శి నరసింహమూర్తి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీమ్ వర్క్‌తో అభివృద్ధి చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యావతి

మొగల్తూరు, జూన్ 10 : మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులంతా పార్టీలు వేరైనా టీమ్ వర్క్‌తో ఉంటూ పని చేద్దామని ఎంపీపీ అందే సూర్యావతి సభ్యులకు సూచించారు. సోమవారం ఆమె అధ్యక్షత నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతన ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే, ఎంపీ సహకారాలు తీసుకుని మరిన్ని నిధులు తెచ్చుకుని గ్రామాల్లో సమస్యలు పరిష్కరించే దిశగా పయనిద్దామన్నారు. ఎంఈవో శ్యామ్యూల్ జాన్, వ్యవసాయ శాఖ అధికారి రహీమ్ మండలంలో 1,398 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టవచ్చని అంచనా వేశామని ఇందుకు సంబంధిత రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం రామోజీరావు మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. జడ్పీటీసీ తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ఎంపీడీవో బాబ్జిరాజు, తహసీల్దార్ భాస్కర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నక్కల కాలువను తక్షణం ఆధునికీకరించాలి


ధర్నా చేస్తున్న రైతు సంఘ నాయకులు

భీమవరం అర్బన్, జూన్ 10: జిల్లాలోని పెరవలి మండలం కాకరపర్రు నుంచి యలమంచిలి మండలం వడ్డిలంక వరకు ఉన్న నక్కల కాలువను తక్షణం ఆధునికీకరించాలని వడ్డిలంక వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ఉపయోగించి ముంపు నీరు బయటకు తోడేలా శాశ్వత పరిష్కారం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ ఏటా వర్షాలు, వరదలు సమయంలో ఈ కాలువను అనుకొని ఉన్న అన్ని గ్రామల్లోని పొలాలు ముంపునకు గురై పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వరద ఇతర ముంపు సమయంలోనూ కాలువలో నీరు స్లూయిస్ అవతల వైపు గోదావరిలోకి మళ్ళించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ సుమిత్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, రైతులు కూడా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ ధర్నాలో కాండ్రేగుల హరిబాబు, శీలబోయిన నాగేశ్వరరావు, గుడాల పద్మనాభం, తదితర రైతు సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ


ముళ్లమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ ఇన్‌చార్జ్ వలవల

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 10: ఎమ్మెల్యేగా బొలిశెట్టి శ్రీనివాస్ గెలుపొందడంతో గ్రామంలో కూటమి నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి గ్రామంలోని ముళ్లమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సర్పంచ్ బేతపూడి సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గంజి గంగాభవాని, నాయకులు చుండ్రు రాంబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దేవళ్ల సుబ్బారావు, మండల జనసేన అధ్యక్షుడు అడపా ప్రసాద్, మాజీ సర్పంచ్ గన్నవరపు రామ్‌కుమార్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిందేసిన కూటమి శ్రేణులు


ఉండిలో విజయోత్సవ ర్యాలీ

ఉండి, జూన్ 10 : ఇది ప్రజావిజయమని ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ జుత్తుగ నాగరాజు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరా జు, యడవల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఉండిలో సోమవారం కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కునుకు శ్రీను, కరిమె రక శ్రీను, కరిమెరక చినబాబు, కిన్నెర వెంకన్న, గంధం బుజ్జి, కర్రిశ్రీను, కుచ్చు శివకృష్ణ, యర్రా రవికుమార్, ఓదూరి రాంబాబు, పాలపర్తి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత సమస్యల్ని కూటమి పరిష్కరిస్తుంది

నరసాపురం రూరల్; జూన్ 10: ఎన్నికల్లో కూటమి విజయంపై సోమవారం పీఎంలంకలో సంబరాలు చేశారు. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, సునీల్ భారీ కేక్‌ను కట్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థి నాయకర్‌కు భారీ మెజారిటీని చేకూర్చడం అభినందనీయమన్నారు. వాతాడి ఉమా, తిరుమాని అర్జునుడు, సంకరపు వెంకటేశ్వరావు, రామకృష్ణ, మైలా జనార్దనరావు, పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


కేకు కట్‌చేస్తున్న అంజిబాబు

భీమవరం టౌన్, జూన్ 10 : బాలకృష్ణ 65వ పుట్టిన రోజు సందర్భంగా కూటమి ఉమ్మడి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అంజి బాబు కేక్ కట్ చేశారు. బాలకృష్ణ అండ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియే షన్ పట్టణ అధ్యక్షుడు పడమట సోమేశ్వరరావు సెక్రెటరీ సాంబ్రాణి నాగబాబు నందమూరి యువసేన జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు బ్రెడ్లు, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, చల్లబోయిన గోవిందు, టీడీపీ పట్టణ కార్యదర్శి గూడూరు సుబ్బారావు పాల్గొన్నారు.

● పాలకొల్లు : పట్టణ నందమూరి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సోమవారం నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 108 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం శ్రీదేశాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రైలు గేటు సమీపంలోగల బాలకృష్ణ ఫ్యాన్స్ ఏర్పాటు చేసిన బస్టాడ్ వద్ద కేక్ కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కెనాల్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రత్యేకంగా బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమాల్లో అభిమాన సంఘం గౌరవాధ్యక్షుడు బోణం వెంకట నారాయణ (మునసబు), కార్యదర్శి మజ్జి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం జ్ఞాపకాలను గుర్తు చేసిన మెగాస్టార్


మెగాస్టార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చిన్న

నరసాపురం, జూన్ 10: మెగాస్టార్ చిరంజీవిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్న మార్యద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో పార్టీకి ప్రజలు చూపిన ఆదరణను మెగా స్టార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని అభివృద్ధి, ఇతర రాజకీయ పరిస్థితుల్ని మెగాస్టార్ చిరంజీవి ఆరా తీశారు. తాను చదువుకున్న వైఎన్ కళాశాల, స్వగ్రామం మొగల్తూరు గురించి ఎన్నో విషయాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర మంత్రిగా తాను ఉన్నప్పుడు పేరుపాలెం బీచ్, తీర ప్రాంతాల్లో చేసిన అభివృద్ధి పనులను మెగాస్టార్ గుర్తు చేశారు. ఒకసారి నరసాపురం రావాలని మెగాస్టార్‌ను ఆహ్వానించినట్లు చిన్న చెప్పారు.

పొన్నమండ కుటుంబాన్ని పరామర్శించిన బండారు

నరసాపురం టౌన్, జూన్ 10: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పొన్నమండ నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల్ని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు సోమవారం పరామర్శించారు. పట్టణంలోని పొన్నపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లారు. పొన్నమండ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమారుడు యుగంధర్‌ను కలిసి సంతాపం తెలిపారు.

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు అభినందనలు


శ్రీనివాసవర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న భోగేశ్వరరావు

పెంటపాడు, జూన్ 10: కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాసవర్మను అలంపురం టీబీఆర్ సంస్థల అధినేత, బీజేపీ నాయకుడు తనుబుద్ధి భోగేశ్వరరావు సోమవారం ఢిల్లీలో కలిసి అభినందించారు. ఈయనతోపాటు తాడేపల్లిగూడెం బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు తదితరులు ఉన్నారు.

● భీమవరం టౌన్ : ఢిల్లీలో కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు అభినందనలు తెలుపుతూ శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలతో స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సోమవారం సభ నిర్వహించారు. చెరుకువాడ రంగసాయి, ఛాంబర్ గౌరవాధ్యక్షుడు మానేపల్లి సూర్యనారాయణ గుప్తా, కార్యదర్శి కాగిత వెంకట రమణ, అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడారు. భీమాల శ్రీరామ్మూర్తి, నరహరి శెట్టి కృష్ణ, ఉండపల్లి రమేష్ నాయుడు, చెల్లబోయిన రంగారావు, నందమూరి రాజేష్, చేపల రాము, చల్లా రాము, ఎస్‌కే చాన్ భాషా, భట్టిప్రోలు శ్రీనివాస రావు అభినందనలు తెలిపారు. కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన భూపతిరాజు శ్రీనివాసవర్మను ఢిల్లీలో పట్టణ బీజేపీ నాయకులు కలసి అభినందనలు తెలిపారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన నరసాపురం ఎంపీ శ్రీనివాస వర్మ, తెలంగాణ ఎంపీ బండి సంజయ్‌ను తాడేపల్లిగూడెం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



బ్రాహ్మణ చెరువు పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ

'బ్రాహ్మణ చెరువును బాగు చేస్తాం'

పాలకోడేరు, జూన్ 10: గొల్లలకోడేరులో బ్రాహ్మణ చెరువు అధ్వానం అంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ, మండల పరిషత్ అధికారులు స్పందించారు. గ్రామంలో అధ్వానంగా ఉన్న బ్రహ్మణ చెరువును సోమవారం ఈఓపీఆర్‌డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ బ్రహ్మణ చెరువులో ఉన్న మురుగునీటిని బయటకు తోడించి శుభ్రం చేసి నీటిని పెడుతామని తెలిపారు. దీంతో టీడీపీ నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చిరంజీవిని కలసిన బొలిశెట్టి


చిరంజీవిని సత్కరించిన బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 10: కేంద్ర మాజీ మంత్రి, సినీ హీరో చిరంజీవిని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిరంజీవిని సత్కరించారు. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్ కల్యాణ్ చాలా శ్రమించారని కల్యాణ్‌కు తోడుగా ఉంటూ రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేయాలని చిరంజీవి తెలిపినట్లు బొలిశెట్టి పేర్కొన్నారు.

బడేటి చంటికి బాబ్జి అభినందనలు


బడేటి చంటికి అభినందనలు తెలుపుతున్న బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలిచిన బడేటి చంటిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, సర్పంచ్ పోతుల అన్నవరం, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గంధం సతీష్ పాల్గొన్నారు.

పితానికి అభినందనల వెల్లువ

ఆచంట, జూన్ 10 : ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణకు పలువురు ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలుపుతున్నారు. సోమవారం కొడమంచిలి శివారు బండివారిపాలెంకు చెందిన కూటమి నేతలు పితాని నివాసానికి వెళ్ళి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి శ్రీను, బాలం వెంకట రమణ, కొరిపల్లి రామకృష్ణ తదితరులున్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ డీటీ సత్యనారాయణ

పోడూరు, జూన్, 10 : గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని పోడూరు జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్ల పక్కన ఉన్న చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ సబ్బితి సుమంగళి మాట్లాడుతూ మండల సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సివిల్ సప్లయ్ డీటీ సత్యనారాయణ మాట్లాడుతూ తూర్పుపాలెంకు చెందిన రేషన్ వాహనదారుడు రాజీనామా చేసి రేషన్ వాహనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారన్నారు. దీంతో వీఆర్వో వేలిమద్రతో రేషన్‌షాపుల వద్ద సరుకులు పంపిణీ చేశామన్నారు. ఆయా శాఖల అధికారులు అయా శాఖల సంబంధించిన అభివృద్ధి పనులను వివరించారు. వైస్ ఎంపీపీలు ఇందుకూరి శీతారామరాజు, గుబ్బల సత్యనారాయణ, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో డి.సుహాసిని, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

గణపవరం, జూన్ 10: గ్రామంలోని కంచికామాక్షి కనకదుర్గమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ తెలగారెడ్డి బాబి దంపతుల నేతృత్వంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మంగళవారం అన్న సమారాధన జరుగుతుందని కమిటీ ఛైర్మన్ తెలిపారు.

ఏకవార రుద్రాభిషేకాలు

పాలకొల్లు అర్బన్, జూన్ 10 : జ్యేష్ఠ శుద్ధ చవితి సోమవారం సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేకంగా ఏకవార రుద్రాభిషేకాలు చేసిన అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.